క్లుప్తంగా

నిర్మాణంలో ఉన్న పనులు పూర్తి చేయాలి

- మార్కెట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి



ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో రైతుతో మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి

విజయనగరం ఫోర్ట్: రైతుబజార్లలో నిర్మాణంలో ఉన్న పనులను నెలఖారులోగా పూర్తి చేయాలని మార్కెట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి సూచించారు. రింగ్ రోడ్డు, ఆర్అండ్‌బీ రైతుబజార్లను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్లలో అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎ.డి శ్యామ్‌కుమార్ , ఎస్టేట్ అధికారి ఉమామహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు నిరంతర విద్యార్థి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: అధ్యాపకులు నిరంతర విద్యార్థుల్లా ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవాలని వీసీ డాక్టర్ జీఎస్ఎన్ రాజు సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో అధ్యాపకులకు నైపుణ్యంపై సోమవారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మెదడుకి పదును పెడుతూ బోధనా పద్ధతులు మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రక్తదానం చేస్తున్న దాత

విజయనగరం ఫోర్ట్: రక్తదానం మహాదానమని ప్రభుత్వ రక్తనిధి కేంద్రం వైద్యురాలు శిరీష అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో ఆర్ఎంపీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీల సంఘ అధ్యక్షుడు గద్దె చిరంజీవి, కోశాధికారి ఉమాశంకర్, గుప్త దివాకర్, ఝాన్సీ భవానీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు



వ్రతాలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం రహదారిలో ఇటీవల నిర్మించిన సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహికవ్రతాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. బ్రహ్మశ్రీ రంప కోదండరామశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు స్వామి సన్నిధిలో వ్రతాలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పోలీస్‌నని చెప్పి ఓ వ్యక్తిపై దౌర్జన్యం చేసి బైక్ లాక్కొని పరారైన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక లీలామహల్ థియేటర్ వద్ద మార్చి 29న పితాని సాయికిరణ్ అనే వ్యక్తి వద్దకు భీమిలికి చెందిన కొయ్యి సూరిబాబు (ఆర్మీలో పనిచేసి మానేశాడు) వచ్చి తాను పోలీస్‌నని బెదిరించి యమహా బైక్ తీసుకుని పరారయ్యాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిఘా పెట్టి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆ పాఠశాలలకు పీఎంశ్రీ వరం

- పీఎంశ్రీకి నియోజకవర్గంలో ఐదు పాఠశాలల ఎంపిక
- పాఠశాలల అభివృద్ధికి రూ. 11.54 కోట్లతో ప్రతిపాదనలు



సతివాడ ఆదర్శ పాఠశాల

నెల్లిమర్ల: నియోజకవర్గంలోని ఆ పాఠశాలలకు మహద్భాగ్యం కలిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపికయ్యాయి. ఇప్పటికే ఆయా పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. ఈ మేరకు చేపట్టనున్న పనులకు సంబంధించి విద్యాశాఖ అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపించారు. ఆయా ప్రతిపాదనల మేరకు ఐదు పాఠశాలల అభివృద్ధికి కేంద్రం రూ. 11.54 కోట్లు మంజూరు చేయనుంది. దీంతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా నియోజకవర్గంలోని ఆ ఐదు పాఠశాలలు అభివృద్ధి చెందనున్నాయి. వివరాల్లోకి వెళితే..నెల్లిమర్ల నియోజకవర్గంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎంశ్రీ పథకానికి ఎంపికయ్యాయి.

నెల్లిమర్ల నగరపంచాయతీలో రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాల, మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల, పూసపాటిరేగ మండలంలోని కుమిలి ఉన్నత పాఠశాల, డెంకాడ మండలంలోని రఘుమండ ఉన్నత పాఠశాల, భోగాపురం మండలంలోని ఆదర్శ పాఠశాలలను పీఎంశ్రీకి ప్రభుత్వం ఎంపిక చేసింది. సతివాడ ఆదర్శ పాఠశాలకు రూ. 1.2 కోట్లు, రామతీర్థం జంక్షన్ పాఠశాలకు రూ. 40 లక్షలు, భోగాపురం ఆదర్శ పాఠశాలకు రూ. 2.4 కోట్లు, రఘుమండ ఉన్నత పాఠశాలకు రూ. 4.9 కోట్లు, కుమిలి ఉన్నత పాఠశాలకు రూ. 2.64 కోట్లతో విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. తొలుత నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసినప్పటికీ మొదటి విడతలో మండలానికి ఒకటి చొప్పున అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, సోలార్ ప్లాంట్, ఆర్ఓ ప్యూరిఫైర్ ఏర్పాటుతో పాటు ల్యాబ్‌లు, లైబ్రరీ అందుబాటులోకి వస్తాయి. అన్ని తరగతి గదులకు పూర్తిస్థాయిలో విద్యుద్దీకరణ చేసి ఫర్నీచర్ సమకూరుస్తారు. అలాగే పాఠశాలకు అవసరమైన అదనపు తరగతి గదులను నిర్మిస్తారు.

పాఠశాలలు అభివృద్ధి చెందుతాయి..



పీఎంశ్రీ పథకానికి నెల్లిమర్ల నగర పంచాయతీలోని రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాలతో పాటు మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల ఎంపికయ్యాయి. పథకంతో ప్రభుత్వ పాఠశాలలు మరింతగా అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులకు అవసరమైన డిజిటల్ క్లాస్ రూమ్స్, తాగునీటి సౌకర్యం, అదనపు తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్స్, తదితర సౌకర్యాలు సమకూరుతాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు ఇప్పటికే పంపించాం.

– అంబళ్ల కృష్ణారావు, ఎంఈఓ, నెల్లిమర్ల.

గడప గడపకూ సంక్షేమం..



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తూ, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణమాఫీ డబ్బులను వారి బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తున్నట్లు తెలిపారు. 'మనబడి నాడు – నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు మొదలుకుని విద్యకు అవసరమైన సామగ్రిని కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు పాఠశాలలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బడ్డుకొండ రమేష్, ఎంపీడీఓ స్వరూపారాణి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

డెంకాడ: మండలంలోని రాజాపులోవ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి. అప్పలస్వామినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. మోదవలస, గొండయ్యపాలెం, జరజాపుకళ్లాలు, బంగార్రాజుపేట, చినవల్లూరు, పెదవల్లూరు, మోపాడ గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే 11 కేవీ జొన్నాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్‌కు కూడా సరఫరా ఉండదన్నారు.

పోయిన మొబైల్స్ అందజేత



బాధితులకు సెల్‌ఫోన్‌లు అప్పగిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్:

పోయిన మొబైల్స్‌ను గుర్తించి బాధితులకు సోమవారం అందజేశారు. పోయిన మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు గతేడాది ప్రారంభించిన వెబ్‌పోర్టల్ ఆధారంగా బాధితులు నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఈ వారంలో పోగొట్టుకున్న 34 స్మార్ట్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు ఫోన్‌లు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వీజెడ్ఎమ్‌మొబైల్‌ట్రాకర్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో కానీ వాట్సాప్ నంబర్ 89779 45606కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌కుమార్, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత పరిశీలించాలి

- పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్



బ్యాగ్‌లను పరిశీలిస్తున్న పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్

భోగాపురం: జగనన్న విద్యాకానుకలో భాగంగా పాఠశాలలకు చేరుకున్న బ్యాగులు, బూట్లు, పాఠ్యపుస్తకాల నాణ్యత పరిశీలించాలని విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఇన్‌చార్జ్ ఎంఈఓ రమణకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ముందుగా ఆదర్శ పాఠశాలకు చేరుకుని జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. 2022 – 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎంతమంది విద్యార్థులు 10వ తరతగతి పరీక్షలకు హాజరయ్యారు.. వారిలో ఎంతమంది ఉత్తీర్ణత సాధించారు.. అనే విషయాలపై ఆరా తీశారు. 97 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 92 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ పార్వతి తెలియజేశారు. అనంతరం సచివాలయానికి చేరుకుని సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, రికార్డులను పరిశీలించారు. మండలం కేంద్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎంతమంది ఉన్నారు అనే విషయాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. పరిశీలనలో ఆయన వెంట ఆర్డీఓ సూర్యకళ, ఆర్‌జేడీ లింగేశ్వరరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఈఓ రామకృష్ణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ ఫార్మా రంగానిదే..

విజయనగరం అర్బన్: ఫార్మా రంగంలో నైపుణ్యం ఉన్న వారికి మంచి జీతంతో కోరిన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ అన్నారు. నగరంలోని టీడీడీసీని సోమవారం సందర్శించి ఫార్మారంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్న యువతతో ఆయన ముచ్చటించారు. రెడాక్స్ లేబొరేటరీ సంస్థ యువతకు శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి గోవిందరావు, జాబ్స్ మేనేజర్ మార్టిన్, రెడాక్స్ డీపీ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకో పార్క్..



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా



కార్పొరేటర్లతో సెల్ఫీ తీసుకుంటున్న రోజా



పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి రోజా

రాష్ట్రంలో తొలిసారిగా మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్క్‌ను మంత్రి ఆర్‌కే రోజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద గజపతి ఆడిటోరియం నుంచి సుమారు పది వేల మంది మహిళలతో పార్క్ వరకు ర్యాలీ చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, వరుదు కల్యాణి, కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి భార్య ఆదిలక్ష్మికి బీమా సొమ్ము అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడకు చెందిన టొంపల నారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య ఆదిలక్ష్మికి జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన పది వేల రూపాయలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ బీమా సొమ్ముతో ఎంతో మందికి ఆసరా కలుగుతోందన్నారు. బీమా సొమ్మును పిల్లల చదువులకు ఉపయోగించి ప్రయోజకులను చేయాలని సూచించారు. మిగతా సొమ్ము త్వరలోనే అందించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, మొయిద అక్కోజీ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పూసపాటిరేగ: వాల్‌పోస్టర్లతో విద్యార్థులు, అధ్యాపకులు

పూసపాటిరేగ: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పూసపాటిరేగ, కుమిలి గ్రంథాలయ అధికారులు నాగేశ్వరరావు, శీరపు ఇందుమతి పిలుపునిచ్చారు. మండలంలోని పూసపాటిరేగ, కుమిలి గ్రంథాలయాలలో విద్యార్థులకు సోమవారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11 వరకు గ్రంథాలయాలలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు.

సమ్మర్ క్యాంపు పోస్టర్ విడుదల..

భోగాపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంప్‌నకు సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వైదా శ్రీరామ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ జగదీష్ మాట్లాడుతూ, వేసవిలో విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా గ్రంథాలయ శాఖ ప్రత్యేకంగా సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రతి విద్యార్థీ ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ముద్దన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట మామిడి, జీడి రైతుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసనలో మామిడి రైతులు

విజయనగరం అర్బన్: జిల్లాలో మామిడి ఉత్పత్తిని గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సభ్యులు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలో లక్షల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోందన్నారు. అయితే గిట్టుబాటు ధర కల్పించడం, దళారుల బెడద తగ్గించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. కలెక్టర్ నాగలక్ష్మి .ఎస్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నిరసనలో రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు సంగిరెడ్డి గోపాలం, బొండపల్లి మండలం మాజీ ఎంపీపీ బండారు కృష్ణ, బొదంకి గౌరినాయుడు, అప్పలనాయుడు, గెద్ద లక్ష్మి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తొత్తడి పైడపినాయుడు, ఈదుబిల్లి అప్పారావు, రవి, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ జయంతికి ఏర్పాట్లు పూర్తి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్యామ్‌సుందర్, తదితరులు

విజయనగరం టౌన్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించనున్న హనుమత్ జయంతికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ప్రోగ్రాం మేనేజర్ శ్యామ్‌సుందర్ అన్నారు. ఈ మేరకు టీటీడీ ఆవరణలో వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జొన్నగుడ్డి శ్రీ సౌభాగ్య ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్వామివారికి తమల పాకు పూజలు, సుందరకాండ పారాయణం, సామూహిక హనుమాన్ చాలీసా నిర్వహిస్తామని.. సాయంత్రం బ్రహ్మశ్రీ రాళ్లపల్లి రామసుబ్బారావుతో ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు పీవీ నరసింహాచార్యులు, వెంకటేశ్వర రాజు, అన్నపూర్ణ, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై భగవంతుడి కృప

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



డిప్యూటీ స్పీకర్ కోలగట్లను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విజయనగరం టౌన్: భగవంతుని కృప అందరిపైనా ఉండాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. గాజులరేగ యాదవవీధిలో కొలువైన శ్రీ లక్ష్మీగణపతి, శ్రీ వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత మురళీ కృష్ణ ఆలయ ప్రథమ వార్షిక మహోత్సవంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కనుగుల రాజు, సత్యనారాయణ, ముత్యాలనాయుడు, గోపి, దాసరి శ్రీను, బాల, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్స్ ఇవ్వాలి

- కలెక్టర్‌కు ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ వినతి



కలెక్టరేట్ ఎదుట ఏపీయూడబ్ల్యూజే సభ్యుల నిరసన

విజయనగరం అర్బన్: సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా పత్రికలో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ మంజూరు చేయాలని ఏపీయుడబ్ల్యూజే జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ సభ్యులు కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తొలుత కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో చెల్లుబాటయ్యేలా బస్‌పాసులు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఎలక్ట్రానిక్ మీడియాకు జిల్లా కేంద్రంలో నాలుగు అదనపు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రింట్ మీడియాకు సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా మండలానికి ఒక అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలం , ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. రైల్వే జర్నీలో రాయితీలను పునరుద్ధరించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పీఎస్‌వీశివప్రసాద్, ఎలిశెట్టి సురేష్‌కుమార్, రాధాకృష్ణ, వైఎస్‌పంతులు, జిల్లా కమిటీ నాయకులు మహాపాత్రో, విజయభాస్కర్, భరత్, డేవిడ్ రాజు, శంకరరావు, శివప్రసాద్, కిశోర్ తదితరులు ఉన్నారు.